క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కె.కోటపాడు: సింగన్నదొరపాలెంలో నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్య సిబ్బంది 129 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 19 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు ఆప్తాలమిస్ట్ సూర్యకుమారి తెలిపారు. క్యాంపు కోఆర్డినేటర్ సాహూలు, సీతా, సంతోషి, భూపతిదేవ్, హెచ్ఎం ఆచారి పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

నర్సీపట్నం: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనివాస్ తెలిపారు. బయపురెడ్డిపాలెం సచివాలయంలో శనివారం ఆయన సిబ్బంది, వలంటీర్లతో సమావేశమయ్యారు. వచ్చే నెల 5వ తేదీలోపు గృహ సారథుల నియామకాన్ని పూర్తి చేయాలన్నారు. వార్డు కౌన్సిలర్ బయపురెడ్డి చినబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా నాయుడు


నాయుడును సత్కరిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా ఆర్. భీమవరానికి చెందిన శానాపతి నాయుడును నియమించారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయలు శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. సర్పంచ్ అమ్మునాయుడు, మండల యాదవ సంఘం అధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, ఎంపీటీసీ అర్జున అప్పారావు, మాజీ సర్పంచ్ చిన్నంనాయుడు సత్కరించారు.

సర్పంచ్‌ల ఫోరం నియోజకవర్గ కన్వీనర్‌గా గోవిందరావు



మాకవరపాలెం: నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్‌గా చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవిందరావు నియమితులయ్యారు. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ సూచనతో గోవిందరావును నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఎమ్మెల్యేకు గోవిందరావు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు సురేష్

నర్సీపట్నం: రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన కొత్తమల్లంపేట గ్రామానికి చెందిన లారీ క్లీనర్ పి.రమణకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రూ. 20 వేల సాయం చేశారు. ఈ నగదును ట్రస్ట్ నిర్వాహకుడు అల్లాడ సురేష్ అందజేసి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు.

భవనాల నిర్మాణానికి సహకరించండి

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ భవన నిర్మాణాల పనులు సకాలంలో పూర్తయ్యేలా స్థానిక నాయకులు కృషి చేయాలని డీపీవో శిరీషారాణి తెలిపారు. కొమ్మళ్లపూడి, బుదిరెడ్లపాలెం, పొట్టిదొరపాలెం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. మంజూరైన 21 ఇళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో సువర్ణరాజు, జేఈ ప్రభు, సర్పంచ్ గేదెల వెంకయమ్మ, కోఆపరేటివ్ అధ్యక్షుడు మోటూరి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఉగాది కల్లా పూర్తి

రోలుగుంట: కొండపాలెం, రోలుగుంట గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ ఏఈ ప్రేమానందం, తహసీల్దార్ వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 58 ఇళ్లు మంజూరు కాగా, 12 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఏపీవో సూర్యామణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాజు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

నాతవరం: గుమ్మడిగొండ, వెదురుపల్లి పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలు, ఇంటింటికీ కుళాయి పనులను ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు శనివారం పరిశీలించారు. పెండింగ్ పనులపై సిబ్బంది పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ జేఈ జోగారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచులు పంచాడ పాప, కాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తాం

- గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ


చోడవరం పట్టణంలో గునిశెట్టివారి వీధిలో ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


సంచార పశువైద్య అంబులెన్స్‌ను చోడవరంలో ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందివ్వడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చోడవరం సచివాలయం–3 పరిధిలో గునిశెట్టివారి వీధి, లక్ష్మీ థియేటర్, పిల్లావారితోట ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాలతో పింఛన్లు రానివారు కొందరు తమ సమస్యను తెలియజేయడంతో త్వరలో వారికి మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై ఆనందం వ్యక్తం చేశారు. గునిశెట్టివారి వీధిలో కాలువలు సక్రమంగా లేవని పలువురు మహిళలు మొరపెట్టుకోగా, కొత్తగా నిర్మిస్తామని ప్రభుత్వ విప్ భరోసా ఇచ్చారు. ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సచివాలయ కన్వీనర్లు బొగ్గు శ్యామల, సిద్దాబతుల వాసు, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, ఎంపీటీసీ పాట్నూరి అరుణ, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జయరామ్, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, మహిళా పోలీసు నిఖిల, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంచార అంబులెన్స్ ప్రారంభం

గ్రామాల్లో పశు వైద్యాన్ని మరింత చేరువ చేయాలని ప్రభుత్వం సమకూర్చిన పశుసంచార అంబులెన్స్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. చోడవరం మండలానికి కొత్తగా మంజూరైన అంబులెన్స్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అందులో సౌకర్యాలు గురించి రైతులకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి, పశువులకు మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు చేపట్టలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా రైతులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారన్నారు. పాడిరైతులు తమ పశువులకు వైద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్ల కుండా నేరుగా గ్రామంలోకే పశువైద్య అంబులెన్స్ వచ్చి డాక్టర్ సహకారంతో వైద్య అందించే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, రైతు తాలూక నాయుడు, లక్కవరం పార్టీ నాయకుడు సీరంరెడ్డి వెంకటరమణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అడుగుపెడితే తరిమికొడతాం

టీడీపీ నేతలకు వాలాబు గిరిజన ప్రజాప్రతినిధుల హెచ్చరిక


మాట్లాడుతున్న వాలాబు గిరిజన ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి: గిరిజన గ్రామాల్లో టీడీపీ నేతలు అడుగు పెడితే తరిమి కొట్టేందుకు గిరిజనులంతా సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోడెల నానిబాబు సహా పలు గ్రామాల గిరిజన ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. వాలాబులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాటలను వక్రీకరించి పైలా ప్రసాదరావు చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు శనివారం తీవ్రంగా ఖండించారు. గిరిజన గ్రామాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేక పైలా సహా టీడీపీ నేతలకు మతిభ్రమించి పిచ్చి పేలాపనలు పేలుతున్నారన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటే గిరిజనుల ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. పోడెల అన్నపూర్ణ, చింతలపూడి, తామరబ్బ సర్పంచ్‌లు దొమ్మంగి బోడమ్మ, టోకురి రామకృష్ణ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, గిరిశింగి సర్పంచ్ గూడెపు రాము, ఉప సర్పంచ్‌లు గలేరి గంగరాజు, గుమ్మడపు మహేష్, వార్డు మెంబర్లు దిప్పల జమ్మునాయుడు, గుల్లి రాజులమ్మ పాల్గొన్నారు.

కన్నంపాలెంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట


ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: కన్నంపాలెంలో అభయాంజనేయ స్వామి నిలువెత్తు విగ్రహాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పండితుల వేదమంత్రాలతో హోమం, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవ రాట మహోత్సవం


ఉత్సవ రాట వేస్తున్న సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్

రావికమతం: కళ్యాణపులోవ తిరునాళ్లకు శనివారం అంకురార్పణ చేశారు. స్వామివారి ఆలయం వద్ద ఉత్సవ రాట వేశారు. వచ్చే నెల 18, 19, 20 తేదీల్లో తిరునాళ్లకు లక్షల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. 80 వరకూ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు వేస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతురాజు, సర్పంచ్ వంజరి గంగరాజు, ఎంపీటీసీ చిన్ని చినమ్మలు, ఈవో మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సత్కారం


ఎంపీడీవో యాదగిరీశ్వరరావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాతవరం: జిల్లా ఉత్తమ అవార్డు పొందడం ద్వారా మండలానికే ప్రత్యేక గౌరవం దక్కిందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టరు నుంచి ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం తన కార్యాలయంలో ఎంపీడీవోను ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, మండల జేఈలు జోగారావు, రాజేష్, వెంకటేశ్వరమ్మ, వెలుగు ఏపీఎం మత్రిలక్ష్మి, ఏపీవో చిన్నారావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఈవోపీఆర్డీ ప్రేమలీల, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి బాసట


నూకరాజు కటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి సిబ్బంది

నర్సీపట్నం: ఆకస్మిక మరణం పొందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి తోటి సిబ్బంది అండగా నిలిచారు. కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో పి.నూకరాజు హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక శారదానగర్‌లో నివాసముంటున్న అతడి కుటుంబాన్ని తోటి సిబ్బంది సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, శ్రీను పరామర్శించి, రూ.45 వేలు అందజేశారు.

వసతి గృహ సముదాయం ప్రారంభం


వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న జర్మన్‌లు

మాకవరపాలెం: నూతనంగా నిర్మించిన నర్సింగ్ వసతిగృహ సముదాయాన్ని జర్మన్ దేశస్తులు శనివారం ప్రారంభించారు. కొండలఅగ్రహారంలో ఇమ్మానుయేలు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలకు జర్మన్‌ల సహకారంతో కొత్తగా వసతి గృహ సముదాయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జర్మన్‌లు ఎక్కార్డ్‌గ్రాఫ్, జుత్తాగ్రాఫ్, మార్కుస్, హెలెనా, బియాతేతోపాటు ఇమ్మానుయేలు సంస్థ డైరెక్టర్ బిషప్ కె.జీవన్‌రాయ్, తామరం ఇమ్మానుయేలు ఎడ్యుకేషన్ క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సింగన్నదొరపాలెంలో పశువుల పాక దగ్ధం

- మంటల్లో చిక్కుకుని పాడిగేదె మృతి
- రూ.2 లక్షల ఆస్తి నష్టం


అగ్నికీలల్లో కాలిపోయిన గేదె

కె.కోటపాడు: సింగన్నదొరపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో రొంగలి అక్కునాయుడుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. పాకను ఆనుకున్న గడ్డివాముతో పాటు ధాన్యం కాలిబూడిదయ్యాయి. పాకలో పాడిగేదె తప్పించుకునే పరిస్థితి లేకపోవడంతో కాలిపోయి చనిపోయింది. ఈ సమయంలోనే పాకలో మరో రెండు గేదె పెయ్యిలు కాలిన గాయాలతో తప్పించుకున్నాయి. రూ.70 వేల విలువైన గేదె, ధాన్యం, గడ్డితో కలిసి రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. నష్టం వివరాలను శనివారం వీఆర్వో నాయుడు నమోదు చేశారు. మాజీ ఎంపీపీ నారపాటి శ్రీరామ్మూర్తి, రొంగలి వెంకటరమణ, లాలం నాని పరిశీలించారు.

కుమారపురం పాఠశాల పునఃప్రారంభం


పాఠశాలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

గొలుగొండ: నాగాపురం పంచాయతీ శివారు కుమారపురం గిరిజన గ్రామంలో శనివారం పాఠశాలను పునః ప్రారంభించారు. ఇక్కడ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, 2016లో మూసివేశారు. దాంతో మూడు కిలోమీటర్లు దూరం నుంచి నాగాపురం పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల చాలా మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ యలమంచిలి రఘురాం సమస్యను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లగా, విద్యా శాఖ అధికారులతో మాట్లాడి పాఠశాల పునః ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే కృషి వల్లే పాఠశాల మరలా ప్రారంభమైందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు కృతజ్ఞతలుతెలిపారు. ఎంఈవో సత్యనారాయణ, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ యలమంచిలి రఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా బిడ్డ ఆచూకీ కనుక్కోండి

- కోల్‌కతాలో కొత్తకోటవాసి అదృశ్యం
- కుమారుడి ఆచూకీ కనుగొనాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు


దిగాలుగా కుటుంబ సభ్యులు


సుబ్రహ్మణ్యం

రావికమతం: నెల రోజులుగా తమ కుమారుడు కనిపించడం లేదని, ఆచూకీ కనుగొనాలని వృద్ధ తల్లిదండ్రులు, అదృశ్యమైన వ్యక్తి భార్యాబిడ్డలు కోరుతున్నారు. కొత్తకోటకు చెందిన రాయి సుబ్రహ్మణ్యం(30) గ్రామంలో చిన్న మరమ్మతులు చేస్తుంటాడు. గత నెల 29న ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యాన్‌లో క్లీనర్‌గా చేరి, వ్యాన్ డ్రైవర్ గట్టా శ్రీను, విశాఖపట్నానికి చెందిన మరో డ్రైవర్ శంకర్‌తో కలిసి అసోం రాష్ట్రానికి పైపుల లోడ్‌తో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కోల్‌కతా వచ్చి ఈ నెల 7,8 తేదీల్లో అక్కడ ఆగారు.8వ తేదీ రాత్రి సుబ్రహ్మణ్యం ఎక్కడికో వెళ్లి, ఎంతసేపటికీ తిరిగి రాలేదు. రెండు రోజులు గాలించి వచ్చేశారు. ఈ విషయాన్ని ఈ నెల 16న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఆందోళన చెందిన సుబ్రహ్మణ్యం భార్య కల్యాణి ఈనెల 17న కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త అదృశ్యం వెనుక ఏదో అనుమానం ఉందని, వెతికించాలని కోరింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ విభీషణరావు సిబ్బందిని, ఆ డ్రైవర్లను అక్కడికి పంపి వెతికిస్తున్నారు. ఇప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు మరింత శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

రామారావు కుటుంబానికి అండగా నిలుస్తాం


మృతుడు కుమారుడికి నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీడికాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త పుటంగి రామారావు కుటుంబానికి అండగా ఉంటామని పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు అన్నారు. కోనాం శివారు జాజులపాలెంకు చెందిన రామారావు(48) అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. పార్టీ నేతలు గొల్లవిల్లి రాజుబాబు, యర్రా అప్పారావు, కురచా నారాయణమూర్తి, లాలం జానకీరాం, కోనాం సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మఅప్పలనాయుడు, కిముడి సన్యాసిరావు గ్రామానికి చేరుకుని రామారావు పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పంపిన రూ.5 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. సలుగు భీమునాయడు, మట్టా అప్పారావు, దుప్పి దాసు పాల్గొన్నారు.

నేడు చెట్టుపల్లిలో 'గడప గడపకు'

చీడికాడ: చెట్టుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు విధిగా హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు


చోడవరం యోగా కేంద్రంలో సామూహిక సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

మాడుగుల: రథసప్తమి సందర్భంగా మాడుగులలో శనివారం తెల్లవారు గ్రామస్తులు నగర సంకీర్తన నిర్వహించారు. స్థానిక సీతారామ స్వామి ఆలయంలో పుట్టా బలరామ్, వై. లక్ష్మిల ఆధ్వర్యంలో ఆదిత్య హోమం నిర్వహించారు. సత్యవరంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. పెద్దేరు నదిలో పలువురు భక్తులు సూర్యనమస్కారాలు చేసి నది ఒడ్డున ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలో రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిక్కుడు కాయలతో రథాలు తయారు చేసి ఆరు బయట తిప్పారు.

సామూహిక సూర్యనమస్కారాలు

చోడవరం: రథసప్తమి పర్వదినాన గౌరీపట్నం సూర్యచంద్రుల దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చోడవరం పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఉషోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో యోగా గురువు పుల్లేటి సతీష్ పర్యవేక్షణలో సామూహిక సూర్యనమస్కారాలు చేశారు.

ఘనంగా మైసమ్మ తల్లి తీర్థం


పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లు

మాడుగుల రూరల్: కె.జె.పురం–దబ్బుకుంటు రహదారిలో మైసమ్మ తల్లి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. జిల్లా స్థాయి ఎడ్ల పందెంలో 25 ఎడ్ల జతలు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో వరుసగా గెలిచిన ఎడ్లబళ్లకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6వేలు, రూ.4 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేశారు. వి.వి.అగ్రహారం జంక్షన్ వద్ద మాడుగుల సమితి తొలి అధ్యక్షుడు దొండా చంద్రమ్మదొర తీర్థం ఘనంగా నిర్వహించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందిస్తామని కమిటీ సభ్యులు పోలిరెడ్డి రమణ, ఈశ్వరరావు తెలిపారు. లచ్చన్నపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ముగిసింది.

బాలరాజులబాబు ఆలయం ప్రారంభం

రోలుగుంట: కె.నాయుడుపాలెంలో పరవాడ దేముడమ్మ ఇచ్చిన స్థలంలో రూ.7 లక్షలతో బాలరాజులబాబు ఆలయాన్ని నిర్మించారు. గుములూరి బాబూరావు తన సొంత నిధులతో విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిని సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రారంభించారు.

ఆర్డీవో సమక్షంలో గృహ ప్రవేశాలు


ఆర్డీవో జయరాం సమక్షంలో గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులు

నర్సీపట్నం: జగనన్న కాలనీలో ఆర్డీవో సమక్షంలో ఎనిమిది మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకున్నారు. నర్సీపట్నం మండలం గురందరపాలెం జగనన్న లేఅవుట్‌ను సర్పంచ్ శానపతి వెంకటరత్నంతో కలిసి ఆర్డీవో హెచ్.వి.జయరాం శనివారం పరిశీలించారు. గృహ నిర్మాణాలు గురించి హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 64 మందికి గృహాలు మంజూరు కాగా 53 మంది నిర్మాణాలు పూర్తి చేశారని హౌసింగ్, రెవెన్యూ అధికారులు వివరించారు. డివిజన్ పరిధిలో గురందరపాలెం లేఅవుట్‌ను ఆదర్శంగా తీసుకుని త్వరతగతిన గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆర్డీవో సూచించారు.

తిమిరాంలో తీర్థం పూట విషాదం

వైఎస్సార్‌సీపీ నాయకుడు గణపతి ఆకస్మిక మృతి



దేవరాపల్లి: తిమిరాంలో సూర్యనారాయణ స్వామి తీర్థం పూట తీవ్ర విషాదం నెలకొంది. స్థానిక సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ అల్లుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పరవాడ గణపతి (46) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి వరకు తీర్థంలో అందరితో కలిసి మెలిసి ఉన్న గణపతి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబీకులు చోడవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడి మృతితో గ్రామస్తులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. మృతుడు గణపతికి భార్య సత్యవతి, వివాహితురాలైన కుమార్తె అనురాధ, డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమారుడు మోహన్‌కుమార్ ఉన్నారు. గణపతి మృతితో ఎడ్లబళ్ల పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిలిపి వేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు సంతాపం ప్రకటించారు.

పశువులకు సకాలంలో టీకాలు


అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

దేవరాపల్లి: పశువులను వ్యాధుల బారిన నుంచి రక్షించేందుకు టీకాలను సకాలంలో వేయించాలని దేవరాపల్లి, ఎం. అలమండ పశువైద్యాధికారులు ఎస్.అలేఖ్య, కె.మంజుషారాణి సూచించారు. పశు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా దేవరాపల్లి రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పశువుల పెంపకం, వ్యాధుల నుంచి జీవాల రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.